క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

పాల్వంచరూరల్: స్థానిక బొల్లోరిగూడెంలోని శ్రీ రామాలయంలో వచ్చే నెల 5 నుంచి 7వ తేదీ వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరు కావాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్రను ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఈ మేరకు అర్చకుడు రామానుజచార్యాలు, సముద్రాల వెంకటేశ్వరరావు, బాడిశె శంకర్‌రావు, సాయిజగదీష్ శనివారం శుభపత్రికను అందజేశారు. అనంతరం వద్దిరాజును శాలువతో కప్పి సత్కరించారు.

నామా జన్మదిన వేడుకలు

జూలూరుపాడు: మాజీ ఎంపీ నామా నాగేశ్వర రావు జన్మదిన వేడుకలు శనివారం జూలూరుపాడులో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, కార్యకర్తలు, నాయకులకు స్వీట్లు పంపిణీ చేశారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి లకావత్ గిరిబాబు, యల్లంకి సత్యనారాయణ, పోలుదాసు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: మాజీ ఎంపీ నామా నాగేశ్వర రావు జన్మదినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు పెద్దమ్మతల్లి ఆలయంలో పూజలు చేశారు. మాజీ మంత్రి వనమా వెంకటేశ్వర రావు, వనమా రాఘవేందర్‌రావు, కిలారు నాగేశ్వరరావు, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షురాలిగా స్వరూప



నియామకపత్రం అందుకుంటున్న స్వరూప

ఇల్లెందు: పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా మరోమారు గాలిపల్లి స్వరూపను నియమిస్తూ జిల్లా అధ్యక్షురాలు దేవీప్రసన్న ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా శనివారం స్వరూప మాట్లాడుతూ.. మహిళా కాంగ్రెస్ విస్తరణకు తన వంతు మరింత కృషి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య సూచనతో మరోమారు తనకు అవకాశం కలిపించిన ప్రసన్నకు, ఎమ్మెల్యే కోరం కనకయ్యకు, పట్టణ, మండల అధ్యక్షులు డానియేల్, పులి సైదులుకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన

జూలూరుపాడు: అనంతారం గ్రామంలో ఆదివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ శంకుస్థాపన చేయనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వేతనం అందక అవస్థలు

జూలురుపాడు: మండలంలో పనిచేస్తున్న ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లకు మూడు నెలలుగా జీతాలు అందకపోవడంతో కుటుంబ పోషణ చాలా ఇబ్బందిగా ఉందని ఫీల్డ్ అసిస్టెంట్ల మండల అధ్యక్షుడు మూడు రమేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. ఈ సమావేశంలో ధరంసోత్ రవి, బానోత్ వీరభద్రం, హరికిషన్, జగదీష్, నగేష్, బాల్య, నరేష్, లక్ష్మి, నాగమణి, షరీఫ్ పాల్గొన్నారు.

అమెరికా అధ్యక్షుడి దిష్టిబొమ్మ దహనం

సింగరేణి(కొత్తగూడెం): అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దురహంకార చర్యలు అవలంబిస్తున్నారంటూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం బస్టాండ్ సెంటర్‌లో దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులు మాట్లాడుతూ.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతీయ పౌరులను అవమానపరిచే విధంగా అమెరికా నుంచి విమానంలో పింపించడాన్ని నిరసిస్తూ ఆయన దిష్టిబొమ్మను దహనం చేసినట్లు చెప్పారు. ఈ ఘటనను భారతదేశ ప్రధాని నరేంద్రమోదీ ఖండించకపోవటం సరైంది కాదన్నారు. పీవైఎల్, పీడీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ భవన్ ఏర్పాటు చేయండి..

జూలూరుపాడు: మండలంలో క్రైస్తవులకు క్రిస్టియన్ భవన్ ఏర్పాటు చేయాలని అసోసియేషన్ ఆఫ్ ఇండిపెండెంట్ క్రిస్టియన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు రెవరెండ్ పి.ఎనోష్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో శనివారం హోలీ ఫెయిత్ మినిస్ట్రీస్ మందిరంలో దైవ సేవకుల సదస్సు జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పాస్టర్లకు గౌరవ వేతనం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ కుమార్, దాసరి డేవిడ్ రాజు, ఎబినేజర్, కోట దేవదానం, మోదుగు ఓనేసిం, రవి, జాన్, జాన్ పాల్, తేలూరు సంజీవరావు, జాన్ పరంజ్యోతి, తిమోతి, జీవన్ కుమార్ పాల్గొన్నారు.

తలుపుతట్టిన సంక్షేమం

సంబురాల్లో ఆదివాసీలు

- పూబెల్లికి 'వరం'లా ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే
- కలెక్టర్ చొరవతో పర్యాటక కేంద్రం దిశగా అడుగులు
- 83 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు
- నేడు శంకుస్థాపన చేయనున్న మంత్రి పొంగులేటి

ఇల్లెందు మండలంలో మారుమూల కుగ్రామం పూబెల్లి. దట్టమైన అడవిలో రహదారి సౌకర్యం కూడా లేని ఆ పల్లెలో క్రూర మృగాల సంచారాన్ని కూడా అధిగమించి దశాబ్దాలుగా ఆదివాసీలు జీవనం సాగిస్తున్నారు. కాలక్రమంలో అరకొర సౌకర్యాలు కల్పించినా వారి జీవన విధానంలో పెద్దగా మార్పు లేదు. అలాంటి గ్రామం స్వాతంత్ర్యం సిద్ధించాక తొలిసారిగా ఒక ప్రభుత్వ సర్వేకు మోడల్‌గా ఎంపికైంది. అదే ఆ గ్రామానికి వరంలా మారింది. సంక్షేమం, అభివృద్ధి పనుల మంజూరుకు బాటలు వేసింది. నేడు గిరిజనులను ఆనందంలో ముంచెత్తుతోంది.



పూబెల్లి గ్రామం వ్యూ

ఇల్లెందురూరల్: మండల కేంద్రానికి ఏడు కిలోమీటర్ల దూరంలో పూబెల్లి గ్రామపంచాయతీ ఉంటుంది. ఇక్కడ పూర్వం నుంచి నూరుశాతం ఆదివాసీలే జీవనం సాగించేవారు. ప్రస్తుతం గ్రామంలో 855 మంది జనాభా ఉండగా అందులో ఆదివాసీలు 845 కాగా గిరిజనేతరులు పది మంది ఉన్నారు. వీరంతా 292 ఎకరాల పట్టాభూమి, 569 ఎకరాల పోడు భూమి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కేవలం రెండు చెరువులు, ఒక కుంట ఆధారంగా వీరి వ్యవసాయం కొనసాగుతోంది. గ్రామానికి ప్రకృతి ప్రసాదించిన జలపాతాల ఆధారంగా కొంత, వర్షాధారంగా మరికొంత విస్తీర్ణంలో వ్యవసాయం చేస్తుంటారు. వీటితోపాటు అటవీ ఉత్పత్తులను సేకరించడం వీరికి అనాధిగా ఉన్న ఆదాయ వనరు.

పర్యాటక క్షేత్రం దిశగా అడుగులు...

నియోజకవర్గ పరిధిలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే కోసం పైలెట్ ప్రాజెక్టుగా పూబెల్లి గ్రామం ఎంపికైంది. సర్వేను ప్రారంభించేందుకు గ్రామానికి వచ్చిన కలెక్టర్ జితేష్ వి.పాటిల్ గ్రామ పొలిమేరలో ఉన్న చెరువును, చుట్టు అల్లుకుపోయిన పచ్చని అందాలను తిలకించి ముగ్ధులయ్యారు. సర్వేను ప్రారంభించి తిరుగు ప్రయాణంలో చెరువు వద్ద ఆగి మరోసారి ప్రకృతి అందాలను ఆస్వాదించిన ఆయన తిరిగి వెంటనే గ్రామస్తుల వద్దకు చేరుకున్నారు. సహజత్వం ఉట్టిపడేలా రూపుదిద్దుకున్న అందాల పొదరిల్లు పూబెల్లి అని అభివర్ణిస్తూ గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. సహజ సిద్ధంగా ఉన్న జలపాతాలు, ప్రకృతి అందాలను పర్యాటకులు వీక్షించేలా కలెక్టర్ ప్రణాళిక రూపొందించారు. ఆ దిశగా క్షేత్రస్థాయి అధికారులతో అడుగులు వేయిస్తున్నారు.

దశాబ్దాల ఎదురుచూపులకు తెర...

మండల కేంద్రం నుంచి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పూబెల్లి గ్రామానికి 2009లో బీటీ రోడ్డు వేశారు. ప్రస్తుతం అది పూర్తిగా ఛిద్రమైంది. పూబెల్లి నుంచి దండగుండాల గ్రామానికి నేటికీ మట్టి రోడ్డే. తాజాగా మంజూరైన నిధులతో దండగుండాలకు బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి కాగా.. అధ్వానంగా ఉన్న బీటీ రోడ్డుకు మరమ్మతులు చేయిస్తామని ఇటీవల జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా తాజాగా మంజూరైన నిధులతో పంచాయతీ పరిధిలో అంతర్గత రహదారులపై సీసీ పరిచారు. దీంతో పూబెల్లి పంచాయతీలో రహదారి సౌకర్యం పూర్తిస్థాయిలో మెరుగైందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు..

ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే పుణ్యమా అని గ్రామంలో ఇంతకాలం పూరి గుడిసెల్లో నివాసం ఉంటున్న పేదలకు పక్కా ఇళ్లు మంజూరయ్యాయి. గ్రామంలో ఇంటింటినీ సందర్శించిన అధికారులు సమగ్రంగా సర్వే చేసి ఇందిరమ్మ ఇళ్ల పథకానికి 83 మందిని అర్హులుగా గుర్తించారు. ఈ మేరకు ఇటీవల వారందరికీ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. తాజాగా ఇళ్ల నిర్మాణ పనులకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం శంకుస్థాపన చేయనున్నారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పూబెల్లిలో ఓ కుటుంబం నివసిస్తున్న రేకుల ఇల్లు

సొంతిల్లు ఊహించలేదు...



నిలువ నీడ కోసం గుడిసె వేసుకున్నాం. గాలిదుమ్ములకు ఏటా బాగు చేసుకుంటున్నాం. పైకప్పు రేకులు వేసుకున్నాం. వేడికి తట్టుకోలేక వేసవిలో పగలు చెట్ల నీడలోనే ఉండేవాళ్లం. అడగకుండానే ఇందిరమ్మ పథకంలో భాగంగా ఇంటిని మంజూరు చేశారు. ఇలా జరుగుతుందని ఎన్నడూ ఊహించలేదు.

– వర్స సుధ, పూబెల్లి

గ్రామ అభివృద్ధికి బాటలు...



రహదారి సౌకర్యాలు మెరుగుపడి ఇప్పుడిప్పుడే అభివృద్ధి బాటలు పడుతున్న గ్రామాన్ని పర్యాటక క్షేత్రంగా ఎంపిక చేశారు. బీటీ, సీసీ రోడ్లతో రహదారులు అభివృద్ధి చేశారు. గూడు సరిగా లేని ప్రతీ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారు. పూబెల్లి అభివృద్ధికి బాటలు వేయడం ఆనందంగా ఉంది.

– జోగ శ్రీకాంత్, పూబెల్లి

నోటిఫికేషన్లు రద్దు చేయండి..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో చీఫ్ సెక్యూరిటీ, చీఫ్ ఆఫ్ మెడికల్ ఆఫీసర్ పోస్టుల నోటిఫికేషన్లను రద్దు చేయాలని ఏరియా జీఎంకు ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సింగరేణి సంస్థలో పనిచేస్తున్న సీనియర్ అధికారులకే ఆ బాధ్యత అప్పగించాలని, సంస్థలో ఎప్పటి నుంచో పనిచేస్తున్న అధికారులను పక్కన పెట్టి, కాంట్రాక్ట్ ఉద్యోగులకు పెత్తనం అప్పజెప్పటం సరైంది కాదన్నారు. ప్రైవేట్ వ్యక్తులతో సింగరేణికి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని తెలిసిన సంస్థ ఉన్నతాధికారులు, కాంట్రాక్టీకరణను సహకరించటం సరైంది కాదని వెంటనే అట్టి ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని లేదంటే తమ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న రజాక్

స్పందించిన జీఎం సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఫిట్ కార్యదర్శులు చిలక రాజయ్య, గోపికుమార్ స్వామి, ఎండీ సత్తార్ పాషా, ఈ.మోహన్‌రెడ్డి, శనిగరపు కుమార్, సీహెచ్ సాగర్, ఎం.కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంక్రిమెంట్‌తోపాటు సదుపాయాలు కల్పించండి..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఓవర్‌మెన్‌గా పదోన్నతి పొందిన వారికి ఇంక్రిమెంట్‌తో పాటు అన్ని సదుపాయాలు కల్పించాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు డిమాండ్ చేశారు. గత నెల 10న కౌన్సెలింగ్ నిర్వహించగా, ఆలస్యంగా ప్రమోషన్ దక్కిన వారికి సైతం ఇంక్రిమెంట్‌తో పాటు ఇతర అలవెన్స్‌లు, సదుపాయాలు అమలు తేదీ నుంచి ఇవ్వాలని ఆయన ఓ ప్రకటనలో సూచించారు. ఈ విషయంలో సింగరేణి యాజమాన్యం స్పందించాలని ఆయన ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

అమరులను ఆదర్శంగా తీసుకోవాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందు: దేశం కోసం, బ్రిటీష్ ముష్కరుల అణిచివేతలకు వ్యతిరేకంగా పోరాడిన భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ నేటితరానికి ఆదర్శం అని పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి వి.అజయ్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కె.పృథ్వీ అన్నారు. శనివారం ఇల్లెందులోని ప్రజాపంథా కార్యాలయంలో పీవైఎల్, పీడీఎస్‌యూ జిల్లా కమిటీ సమావేశాలు జరిగాయి. ఈ సభలో వారు మాట్లాడుతూ... ఈ నెల 23న భగత్‌సింగ్ 94వ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డి.దేవి, నరేందర్, రామకృష్ణ, మంగయ్య, ఇస్లావత్ కోటేష్, సాయి, పార్థసారధి, గణేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పోస్టర్లు ఆవిష్కరించారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరచారి

పాల్వంచరూరల్: విద్యార్థుల విద్యాప్రమాణాల అభ్యున్నతికి బాటలు వేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరచారి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పాలకోయతండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులకు సంబంధించి ఇల్లు, పాఠశాలలను అనుసంధానం చేసే కీలకమైన వారధిగా పీటీఎంలు నిలవాలన్నారు. విద్యాభివృద్ధికి టీచర్లు పేరెంట్స్ సమావేశాలు నిర్వహించాలన్నారు. వంటిపూట బడుల నిర్వహణలో సమయపాలన పాటించాలన్నారు. విద్యాశాఖ కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి సైదులు, హెచ్‌ఎం దీనమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్థానిక రైతులకు అన్యాయం

జూలూరుపాడు: జిల్లాలో ప్రారంభమైన సీతారామ ప్రాజెక్టు నీళ్ల ఇక్కడి మండలాలకు ఇవ్వకుండా బయట ప్రాంతాలకు తరలించడానికి సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని పలువురు నాయకులు అన్నారు. శనివారం జూలూరుపాడు బస్టాండ్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో నాయకులు గౌని నాగేశ్వరరావు, ఎస్కే ఉమర్ మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్టు నీళ్ల ఏజెన్సీ మండలాలకు ఇవ్వకుండా ఇక్కడ రైతులను నట్టేట ముంచుతూ బయట ప్రాంతాలకు తరలిస్తున్నారని వాపోయారు. సీతారామ ప్రాజెక్టు నీళ్ల మండలానికి ఇవ్వకుండా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని ఆరోపించారు. ముగ్గురు మంత్రుల కుట్రతో నీళ్ల వారి ప్రాంతాలకు తరలించుకుంటున్నారని విమర్శించారు. మండల ప్రజలకు, రైతాంగానికి సీతారామ ప్రాజెక్టు నీళ్ల ఇవ్వాలని, లేదంటే రైతులతో దశల వారి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వల్ల రమేష్, బత్తుల గోపి, తెల్ల వెంకటేశ్వర్లు, రాంబాబు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దకాలం..!



వజ్జోనిగూడెంలో అంగన్‌వాడీ భవనం

టేకులపల్లి: పదేళ్లు అవుతున్నా అంగన్ వాడీ భవన నిర్మాణం పూర్తి కాలేదు. చింతోనిచెలక పంచాయతీ వజ్జోనిగూడెం అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేకపోవడంతో స్థానిక ప్రాథమిక పాఠశాల భవనంలో నిర్వహిస్తున్నారు. పదేపదే విజ్ఞప్తుల మేరకు అంగన్‌వాడీ భవన నిర్మాణానికి 2015–16లో నాబార్డు నిధులు రూ.8 లక్షలు మంజూరయ్యాయి. పనులు కూడా ప్రారంభించారు. స్లాబ్ వరకు నిర్మించారు. ఏం జరిగిందో.. ఏమో... పనులు నిలిచిపోయాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అంగన్‌వాడీ భవనం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కంటి వైద్యపరీక్షలు చేయించుకోండి..

కొత్తగూడెంఅర్బన్: కంటి సమస్యలున్న వారు గ్లోకోమా పరీక్షలు చేయించుకోవాలని కంటి వైద్యులు డాక్టర్ దీపిక అన్నారు. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమం శనివారం జిల్లా సర్వజన ఆస్పత్రిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా ప్రపంచ గ్లోకోమాని వారోత్సవాన్ని 9వ తేది నుంచి నుంచి శనివారం వరకు జరుపుకోవడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా ప్రజలకు కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ్‌కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ ఈటరాధామోహన్, డాక్టర్ కేశవరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ దీపిక

వినియోగదారులు దోపిడీకి గురవుతున్నారు..

కొత్తగూడెంఅర్బన్: వినియోగదారులు వ్యాపారరంగంలో నిరంతరం దోపిడీకి గురవుతున్నారని తెలంగాణ వినియోగదారుల సమాచార హక్కుల అవేర్నెస్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు జూలూరి రఘుమాచారి అన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా శనివారం కొత్తగూడెంలోని బస్టాండ్ సెంటర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ వినియోగదారుడికి వారు చెల్లించే ప్రతీ పైసాకు నాణ్యమైన, నమ్మకమైన వస్తుసేవలను పొందే హక్కు ఉందని, ఆ హక్కుకు భంగం కలిగితే జిల్లా వినియోగదారుల కమిషన్‌లలో ఫిర్యాదు చేసి న్యాయం పొందవచ్చని తెలిపారు. దేశంలో 1986 సంవత్సరంలో వినియోగదారుల రక్షణ చట్టాలు ఏర్పడ్డాయని, చట్టాలను అమలు చేయాల్సిన అధికారుల వైఫల్యం కారణంగా ప్రతీరోజు పాల ప్యాకెట్ దగ్గర నుంచి షాపింగ్ మాల్స్ వరకు ఎక్కడో ఒకచోట వినియోగదారులు దోపిడీకి గురవుతున్నారని ఆరోపించారు. వినియోగదారులు వారు కొనే ప్రతీ వస్తువుకు, పొందే సేవలకు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని కోరారు. తద్వారా వారు మోసానికి గురైతే ఫోరం దృష్టికి తీసుకెళ్లి న్యాయం పొందవచ్చని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఫోరం నాయకులు కోడూరి నాగేశ్వరరావు, నోముల రవి, ఎల్లయ్య, కాసర్ల గోవిందాచారి, శ్రీనివాస్, సదానందం, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పించాలి...

సూపర్‌బజార్(కొత్తగూడెం): వినియోగదారులు తమ హక్కులపై అవగాహన కల్పించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అన్నారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా శనివారం తన చాంబర్‌లో కన్స్యూమర్ ఆర్గనైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, కన్స్యూమర్ వాలంటరీ ఆర్గనైజర్లు జూలూరి రఘుమాచారి, గుగులోత్ బాలు, మహ్మద్ రియాజ్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



సూపర్‌బజార్(కొత్తగూడెం): మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

సింగరేణి మహిళా కళాశాలలో..

సింగరేణి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శనివారం ప్రపంచ వినియోగదారుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సీహెచ్ శారద మాట్లాడుతూ... వినియోగదారులు ప్రతీరోజు కొనుగోలు చేసే వస్తువులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. వినాయోగదారుల పరిరక్షణ చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వి.రజిని, మాణిక్యాంబ, ఆర్.కృష్ణవేణి, శైలజ పాల్గొన్నారు.

'ముత్తారపు కట్ట'..ఉత్తమ పాఠశాల



ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందిస్తున్న గ్రామపెద్దలు

ఇల్లెందురూరల్: మండలంలోని ముత్తారపుకట్ట పాఠశాలను ఉత్తమ పాఠశాలగా మండల విద్యాశాఖ శనివారం ఎంపిక చేసింది. స్కూల్ కాంప్లెక్స్‌ల వారీగా ఇటీవల నిర్వహించిన టీఎల్ఎం మేళాలో ఏడు అంశాల వారీగా పరిశీలించి మండల స్థాయి కమిటీ ఉత్తమ పాఠశాలగా ముత్తారపు కట్టను జిల్లా స్థాయికి నామినేట్ చేసింది. మారుమూల ప్రాంతానికి చెందిన ముత్తారపు కట్టలో విద్యార్థుల నైపుణ్యాలను వృద్ధి చేస్తూ ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఫలితంగా తొలుత స్కూల్ కాంప్లెక్స్ స్థాయి, ఆ వెంటనే మండల స్థాయిలో ఉత్తమ పాఠశాలగా ఎంపిక కావడం పట్ల గ్రామపెద్దలు హర్షం వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయుడు కబ్బాకుల రవి, ఉపాధ్యాయుడు అరెం రవికుమార్‌లను అభినందించారు

హామీలు అమలు చేయాలి

జూలురుపాడు: ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దెబ్బెందుల సాయికుమార్ మాదిగ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో నిరాహార దీక్షలను చేపట్టారు. హాజరైన చాపలమడుగు రామ్మూర్తి, చంగల గురునాథం మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, ఎస్సీల వర్గీకరణ చేసిన తర్వాతనే ఇప్పుడు ప్రకటించిన ఉద్యోగ ఎస్సీల వర్గీకరణ అమలైన తర్వాతనే ఈ ఉద్యోగ ప్రక్రియను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కాకటి కృష్ణ, చంగల నరసింహారావు, కాకటి నాగేష్, దేవరకొండ సుందరయ్య, జగన్ నాగరాజ్, మంద వికాస్, ఇష్టం రవి, దేవరకొండ పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



దీక్ష చేస్తున్న నాయకులు

ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించండి..



ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పాల్వంచరూరల్: శాసనసభలో జగదీష్‌రెడ్డిపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేసి ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డిని అసెంబ్లీలో సస్పెండ్ చేయడాని నిరసిస్తూ శనివారం మాజీ మంత్రి వనమా ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జిలు ధరించి బీఆర్ఎస్ నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వనమా మాట్లాడుతూ... అసెంబ్లీలో ప్రజాసమస్యలను చర్చకు రాకుండా రాజకీయాలు చేయడం సీఎంకు తగదన్నారు. ఎన్నికల ముందు ఆరు గ్యారంటీల హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించి ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వనమా రాఘవేందర్‌రావు, కిలారు నాగేశ్వరరావు, మంతపురి రాజ్‌గౌడ్, కాంపెల్లి కనకేష్, పూసల విశ్వనాథ్, మల్లేల శ్రీరామ్మూర్తి, బాదవత్ శాంతి, మడవి సరస్వతి, కనగాల బాలకృష్ణ, నాయుడు, దాసరి నాగేశ్వరరావు, కాల్వ ప్రకాశ్, ముత్యాల ప్రవీణ్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఏరియా మనుగడకు ఐక్య పోరాటాలు

టేకులపల్లి: ఇల్లెందు ఏరియా మనుగడకు, జేకే ఓసీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు అవసరమని అందుకు ఏఐటీయూసీ కార్యాచరణ ప్రకటిస్తుందని ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.సారయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎండీ నజీర్ అహ్మద్ అన్నారు. ఈ మేరకు శనివారం కోయగూడెం ఓపెన్‌కాస్టులో జరిగిన పిట్ మీటింగ్‌లో మాట్లాడుతూ... రాజకీయ జోక్యం వలన సింగరేణి పరిస్థితి అగమ్య గోచరంగా మారిందన్నారు. గత బీఆర్ఎస్ పద్ధతిలోనే కాంగ్రెస్ పాలన నడుస్తోందని ఆరోపించారు. డీఎంఎఫ్, సీఎస్ఆర్ తదితర నిధులు దుర్వినియోగం అవుతున్నాయన్నారు. యాజమాన్యం ఎమ్మెల్యేలకు సోకాల్, లీడర్లకు దాసోహం అంటున్నారని విమర్శించారు. ఈనేల 7, 8 తేదీలలో సీఎండీ స్థాయిలో ఉద్యోగుల సమస్యలపై మాట్లాడడం జరిగిందని, అందుకు యాజమాన్యం సానుకూలంగా స్పందించి త్వరలో పరిష్కరిస్తామన్నారని తెలిపారు. ఈ సమావేశంలో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు దాసరి రాజారాం, కేటీసీ ఫిట్ సహాయ కార్యదర్శులు షేక్ సర్వర్, బానోత్ బాలాజీ, షిఫ్ట్ ఇన్‌చార్జ్‌లు హుస్సేన్, కరుణ శంకర్, సామల శ్రీనివాస్, శ్యామ్ సుందర్, బాలుకుమార్, రాజ్ కుమార్, షేక్ ఇబ్రహీం, బండి సీతారాములు, కనకరాజు, వెంకటనర్సయ్య, ఉమేష్ కుమార్, అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సారయ్య

మౌలిక వసతులు కల్పించండి..



మాట్లాడుతున్న ముత్యాల విశ్వనాథం

పాల్వంచరూరల్: ఆదివాసీ గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం డిమాండ్ చేశారు. మండల పరిధి రేగులగూడెం గ్రామపంచాయతీలోని రాళ్లచెలక గ్రామంలో శనివారం సీపీఐ గ్రామశాఖ మహాసభ మడకం లక్ష్మయ్య అధ్యక్షతన జరిగింది. మాట్లాడుతూ.. ఆదివాసీ గిరిజన గ్రామాల్లో రహదారి, తాగునీరు, విద్యుత్, విద్య, వైద్య సౌకర్యాలు కల్పించడంలో ఐటీడీఏ అధికారులు నిర్లక్ష్యంగా చేస్తున్నారని విమర్శించారు. అటవీ శాఖ అధికారులు పోడు భూములకు పట్టాలు ఇవ్వకుండా గిరిజనులపై అక్రమ కేసులు బనాయించి భయబ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీ గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే కూనంనేని దృష్టికి తీసుకెళ్లి బడ్జెట్ సమావేశాల్లో పరిష్కారం జరిగే విధంగా చూస్తామన్నారు. అనంతరం గ్రామశాఖ నూతన కమిటీ కార్యదర్శిగా మడకం లక్ష్మయ్య, సహాయ కార్యదర్శిగా మడకం జోగయ్యలతోపాటు 9మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, నిమ్మల రాంబాబు, కొంగర అప్పారావు, వేములపల్లి శ్రీనివాసరావు, అమృతరావు, వజ్జ సత్యం, సమ్మయ్య, కిరణ్ పాల్గొన్నారు.